
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025 | 7



ఉధృతంగా గోదారి
రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ప్రవాహం 9
ఇద్దరు దొంగలు..
97 చోరీలు 8



అమ్మా దుర్గమ్మా..

కొవ్వూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుందర గణేష్ శనివారం అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. చండీహోమం నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో పూజలు చేస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఊళ్లకు చెప్పి వెళ్లండి!

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు/రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టామని..ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల కారణంగా దొంగతనాలు జరుగుతున్నాయని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ శనివారం పరిశీలించి మాట్లాడారు.దొంగలు వృద్ధులు, ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నారన్నారు. ఇటీవల నల్లజర్ల, తణుకులో ఇదే తరహాలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. దొంగలను గుర్తించామన్నారు. సెలవులు పురస్కరించుకుని ఊళ్లకు వెళుతున్న వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చి లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఎక్కువగా నగదు, బంగారం ఉంచకూడదని అన్నారు. నిడదవోలు పోలీస్ సర్కిల్ పరిధిలోని సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట రాజమండ్రి ఎస్పీ డి.నరసింహ కిశోర్, కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ బాలాజీ సుందరరావు ఉన్నారు.



అకీరా మియావాకీ మొక్కల పెంపకాన్ని పరిశీలించి.. మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

అకీరా మియావాకీతో మేలు

రాజానగరంలో కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలన

రాజానగరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ, వనరుల సంరక్షణలో అకీరా మియావాకి మొక్కల పెంపకం గొప్ప ఆలోచనా విధానమని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలో 25 సెంట్లలో చేపట్టిన అకీరా మియావాకి మొక్కల పెంపకాన్ని, ఫామ్ పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షేడ్‌లను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అకీరా మియావాకి మొక్కల పెంపకం అద్భుత ఆలోచనా విధానమని కొనియాడారు. అకీరా మియావాకి మొక్కల పెంపకానికి 2970 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. వాటిలో జామ, వెలగ, బిల్వ, మర్రి, నర్రగిలగిల, మద్ది చెట్టు, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధ తరగ తదితర మొక్కలు నాటడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఆమె వెంట డ్వామా ఏపీడీ రాంప్రసాద్,ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, డ్వామా సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంలు పరిశీలన

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఈవీఎం గోదాములను కలెక్టర్ కీర్తి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి,తనిఖీలు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు నిరంతర సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణనాయక్, తహశీల్దారు పాపారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శక్తి పీఠం..పిఠాపురం



పుర్హుతికాఅమ్మవారు



రాజరాజేశ్వరీదేవి

అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం.. అధిష్ఠాన దేవతైన పుర్హుతికాదేవి కొలువై ఉన్న పిఠాపురం పాద గయ క్షేత్రం.. దక్షిణకాశీగా, శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. స్వయం భూగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి,ఆదిశంకరాచార్య స్వామి ప్రతిష్ఠింపబడిన రాజరాజేశ్వరీదేవి ఇక్కడే కొలువై ఉన్నారు. శక్తిపీఠం కావడంతో ఇక్కడ పుర్హుతికా అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు, చండీయాగం చేయించుకునేందుకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర ఒరిస్సా,ఢిల్లీ, గోవా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు వస్తారు. పరాశక్తి ఆజ్ఞ మేరకు మహావిష్ణువు సతీ మృతదేహాన్ని తన సుదర్శనచక్రంతో ఖండించాడు. సతీ దేహభాగా లు భూమిపై పడి 108 శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అందులో 101 విశేషంగా, 52 పీఠాలు ముఖ్యమైనవిగా, అతి ముఖ్యమైన 18 భాగాలు పడిన చోట అష్టాదశ శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో ముఖ్యమైన పీఠ భాగం(పిరుదులు) పడిన చోటే పిఠాపురంగా విరాజిల్లుతోంది. పాదగయ క్షేత్రంలోని పుర్హుతికా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే అష్టాదశ శక్తి పీఠాల నమూనా విగ్రహాలు కనిపిస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

కొండల్లో తలుపులమ్మ

ఆదివారం ప్రత్యేకం



మహిమ గల అమ్మవారు తలుపులమ్మ తల్లి.. కాకినాడ జిల్లా లోవ గ్రామంలో వెలసింది. తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ధారకొండ, తీగ కొండల మధ్య ఒక గుహలో స్వయంభుగా వెలిసినట్టు ఆలయ పండితులు చెబుతుంటారు. క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినప్పుడు ఈ క్షేత్రంలో పూజలు చేస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటాయని భక్తుల నమ్మకం.ఈ నేపథ్యంలో నిత్యం కొత్త వాహనాలు, భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఉంటుంది. ఏటా రూ.20 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలతో పోటీ పడుతున్న ఈ దేవస్థానం ప్రసిద్ధి దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతుంది. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.20 కోట్లు ఖర్చు చేసి ఆలయ పునః నిర్మాణ పనులు చేపడుతున్నారు.ఏటా ఆషాఢమాసంలో నెల రోజులు ఆలయంలో అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తారు.

- (తుని రూరల్-ఆంధ్రజ్యోతి)

జై భవానీ!

దసరా వచ్చిందంటే అమ్మవార్ల ఆలయాలు ప్రత్యేకం.. భక్తులతో కిటకిటలాడుతూనే ఉంటాయి.. మన జిల్లాలోనూ ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. వాటి చరిత్రను ఒకసారి తెలుసుకుందాం.. వీలైతే ఒకసారి చూసొద్దాం..!





భక్తుల పాలిట విజయదుర్గ

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెదురుపాక విజయదుర్గా అమ్మవారు విరాజిల్లుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో గత 54 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1972లో పీఠాధిపతి గాడ్ విజయదుర్గా పీఠాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వెదురుపాక విజయదుర్గా పీఠంలో దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 1989లో ప్రస్తుత శృంగేరి పీఠాధిపతి భారతీయతీర్థ చేతులమీదుగా శంకుస్థాపన చేసి పీఠాన్ని నిర్మించారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య ఆరాధనలు చేస్తున్నారు.దసరా 10 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు స్వయంగా శ్రీచక్ర అర్చనలు చేసుకుని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకుంటారు. గత 54 సంవత్సరాలుగా పీఠంలో ఉచిత నిత్య అన్నదానం జరుగుతుంది.


- (రాయవరం -ఆంధ్రజ్యోతి)

ఏటా..భవానీ మాల



భవానీ మాల చాలా మందికి ఆనవాయితీ.. ప్రతి ఏటా వేస్తారు. దుర్గమ్మ అంటే నమ్మకం. అమలాపురం వెత్సావారి అగ్రహారానికి చెందిన ఆర్లపల్లి ముత్యం ఇప్పటికే పలు పర్యాయాలు భవానీ మాల ధరించి గురుభవానీగా మారారు. ఇప్పటి వరకు సుమారు 15 వేల మందికి భవానీ దీక్ష ఇచ్చారు. అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లిలో శ్రీమురళీకృష్ణస్వామి ఆలయంలో శ్రీదుర్గా వీరభద్ర భవానీ పీఠం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు భవానీ మాలధారులతో కలిసి కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన రాచకొండ కామేశ్వరశర్మ తొలిసారిగా భవానీ దీక్షను కోనసీమకు పరిచయం చేశారు. ఆయన వద్దే దీక్ష తీసుకుని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది పీఠం వద్ద దసరాకు 108 మంది భవానీ మాల ధరించారు. ఇక కార్తీక మాసంలో మండల దీక్షకు ఏటా 300 మందికి పైబడి భవానీ మాల ధరిస్తున్నారు. - (అమలాపురం రూరల్ - ఆంధ్రజ్యోతి)

నాటి లాంతర్ల సెంటరే..దేవిచౌక్!



బ్రిటీష్ హయాంలో మూడు లాంతర్ల సెంటరే.. రాజమహేంద్రవరం దేవిచౌక్.1933లో బత్తుల మల్లికార్జున రావు సోదరులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో దేవిచౌక్‌గా మారింది. బ్రిటీష్ హయాంలో నాలుగు రోడ్ల కూడలిలో మునిసిపాలిటీ వారు వీధిదీపాలుగా లాంతర్లను ఏర్పాటు చేసేవారు.ఇలా మూడు లాంతర్లను దేవిచౌక్‌లో సాయంత్రం 5:30 గంటలకే వెలిగించి వెళ్లేవారు.అప్పటి నుంచి మూడు లాంతర్ల కూడలిగా దేవిచౌక్‌ను పిలిచేవారు.శ్రీబాలాత్రిపుర సుందరిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాక మూడు లాంతర్ల సెంటర్ దేవిచౌక్‌గా రూపాంతరం చెందింది. నాలుగు స్తంభాలను నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలా ఆలయ ప్రస్తానం ప్రారంభమైంది. ఇక్కడ నవరాత్రులు 1933లో మొదలు పెట్టారు. ఈ ఏడాది 92వ దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.

- (రాజమహేంద్రవరం సిటీ - ఆంధ్రజ్యోతి)



పెద్దాపురం పెద్దమ్మ మరిడమ్మ

17వ శతాబ్దం నుంచి పెద్దాపురం పెద్దమ్మగా మరిడమ్మ ఆలయం పేరెన్నికగన్నది. పసుపు పూసిన కర్ర గద్దెను అమ్మవారి ప్రతిరూపంగా పూజిస్తారు. మరిడమ్మ జాతర ప్రతీ ఏడాది జ్యేష్టమాసంలో అమావాస్య నుంచి ప్రారంభమై ఆషాఢ మాసంలో అమావాస్య వరకూ 37 రోజుల పాటు జరుగుతాయి. పెద్దాపురం మానోజీ చెరువు సమీపంలో గ్రామదేవత గా మరిడమ్మ వెలిశారని స్థానికులు చెబుతారు. అడవిలో పశువులు కాపరులకు 16 ఏళ్ల యువతి కనిపించి నేను చింతపల్లివారి ఆడబడుచునని చెప్పి మాయమైనట్టు పురాణాలు చెబుతున్నాయి. మానోజీ చెరువు సమీపంలో ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించడంతో అక్కడే తాటాకుపాక వేసి నాడు ఆలయ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి నేటి వరకూ ధూపదీప నైవేద్యాలను అమ్మవారు అందుకుంటున్నారు.ప్రధాని మోదీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా పెద్దాపురంలో ఉన్న మరిడమ్మ ఆలయం గురించి ప్రస్తావించారు.

- (పెద్దాపురం -ఆంధ్రజ్యోతి)

గోదావరిలో ఇద్దరు భవానీ మాలధారుల గల్లంతు

- బావమరిదిని కాపాడబోయిన బావ
- కొట్టుకుపోయిన బావబావమరిది
- పుష్కర్‌ఘాట్ వద్ద ఘటన
- భార్యాపిల్లల కళ్లెదుటే ప్రమాదం



పుష్కరఘాట్ వద్ద రోదిస్తున్న మృతుడి భార్య, భవానీ మాలలో ఉన్న పెద్ద కుమార్తె



వీరబాబు



బాపిరాజు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇద్దరు భవానీ మాలధారులు గల్లంతయ్యారు.గోకవరం మండలం పెంటపల్లికి చెందిన గుబ్బల బాపిరాజు(28) రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లోని ఒక అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు.రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన బావమరిది (భార్య అన్న) రాయుడు వీరబాబు(21) హైదరాబాద్‌లోని ఓ గోల్డ్ షాపులో పనిచేస్తున్నాడు. దసరా కావడంతో బావ వద్దకు వచ్చాడు. బాపిరాజు, వీరబాబు, బాపిరాజు పెద్ద కూతురు నాలుగేళ్ల భవానీ భవానీ మాల వేసుకున్నారు. పుష్కరఘాట్‌కి శనివారం సాయంత్రం గోదావరి స్నానానికి వచ్చారు.బాపిరాజు, వీరబాబు స్నానానికి దిగారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో వీరబాబు కొట్టుకుపోతుండడంతో బాపిరాజు అతడి మెడలోని ఎర్ర కండువా అందించబోయి వరద ఉధృతిలోకి జారిపోయాడు. దీంతో ఇద్దరూ గల్లంతయ్యారు.బాపిరాజు పది మీటర్ల వరకూ.. పుష్కరఘాట్‌లో వరద మలుపు తిరిగే చోటు వరకూ చేయిపైకి పెట్టి టవల్ ఊపుతూనే ఉన్నాడు. అతడి భార్య శ్రావణి బావా బావా అని అరుచుకుంటూ మెట్ల వెంబడి పరుగు పెట్టింది.ఆ సమయంలో ఘాట్‌లో 150 మంది వరకూ జనం, పోలీసులు ఉన్నారని చెబుతున్నారు. కానీ ఎవరికీ ఈత రాకపోవడంతో గోదావరిలోకి దిగలేదు. ఒక వ్యక్తి మెట్ల వెంబడి పరుగు పెట్టుకుంటూ వెళ్లి బాపిరాజు జుట్టు పట్టుకున్నాడు. అయితే ఒడి తీవ్రంగా ఉండడంతో జుట్టు జారిపోయి వరదలో కొట్టుకుపోయాడు. అప్పటి వరకూ తనతో ఉన్న భర్త, అన్న వరదలో కొట్టుకుపోయారని తెలియడంతో భార్య, చిన్నారిని సముదాయించడం ఎవరి తరమూ కాలేదు. పోలీసులు, ఫైర్ సర్వీసు సిబ్బంది ఒక మత్స్యకార నావలో గాలింపు చేపట్టారు. చీకటి పడడం, వరద ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల ఫలితం లేక పోయింది.ఆదివారం ఉదయం కాకినాడ నుంచి ఎస్‌డీఆర్ ఎఫ్ బృందం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. శనివారం సాయంత్రమే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం గమనార్హం.

మింగేసిన..నిర్లక్ష్యం

వరద ఉధృతి రెండు రోజుల నుంచీ పెరుగుతున్నా అధికారులు సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. కనీసం కర్రలతో బారికేడింగ్ ఏర్పాటు చేయలేదు. దసరా కావడంతో పెద్ద సంఖ్యలో భవానీ మాల ధారులు పుష్కరఘాట్‌కి స్నానాలకు వస్తున్నారు.వారం కిందట ఒక వ్యక్తి వరద లో కొట్టుకుపోయి ప్రాణాలు విడిచాడు.అయినా రెవెన్యూ, మునిసిపల్ యంత్రాంగం మేల్కోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా శని వారం ఒక కుటుంబం అనాథగా మారింది. ఇకనైనా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

ధనలక్ష్మిగా..



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):దసరా ఉత్సవాలను గత ఆరు రోజులుగా ఊరూవాడా ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. భక్తులు దర్శించుకుని పూజలు చేస్తున్నారు.. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.. ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరం రాజేంద్రనగర్ సమీపంలోని నెహ్రూనగర్ కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు రూ.35 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందులో రూ.500, రూ.200, రూ.100 నోట్లు ఉన్నాయి. అమ్మవారిని ముస్తాబు చేసిన తీరు ఆకట్టుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని అలంకరించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలించింది.

పర్యాటకానికి ఊతం హోంస్టే : కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పర్యాటకానికి ఊతమివ్వడానికి హోంస్టే ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీఎం నారా చంద్రబాబునాయుడు రాజధాని నుంచి హోంస్టే పోస్టర్‌ను ఆవిష్కరించి, వర్చువల్‌గా కలెక్టర్ కీర్తితో మాట్లాడారు. హోంస్టే పర్యాటకం వల్ల స్థానికులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు.జిల్లాలో ఈ విధానం విస్తరిస్తే యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. డీఆర్‌డీఏ ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి హోంస్టే రంగంలో ప్రోత్సహిస్తామన్నారు. గోకవరం మండలం వీరలంకపల్లిలో ఉన్న చింతాకిరణ్ హోంస్టేను మొదటిదిగా గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి 22 కిలోమీటర్లు, విమానాశ్రయం నుంచి 16 కిలోమీటర్లు, మారేడుమిల్లి- అడ్డతీగల నుంచి 42 కిలోమీటర్లు, హైవే నుంచి 100 మీటర్ల దూరంలోనే ఇది ఉందని అధికారులు చెప్పారు. అత్యాధునికంగా తీర్చిదిద్దినట్టు నిర్వాహకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ వై.మేఘస్వరూప్, డీఆర్‌వో టి. సీతారామమూర్తి, టూరిజం ఏడీ పవన్‌కుమార్, జిల్లా పర్యాటక అధికారి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



- ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం
- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు

ఈ నెల 30 వరకు గడువు.. డిసెంబరు 7న రాత పరీక్ష

- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే ఆ విద్యార్థులు విజయ సోపానాన్ని అధిరోహించడం ఖాయం. చదువుకు పేదరికం అడ్డు కారాదు. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువు మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉపకార వేతనాలు అందిస్తుంది. దీనిలో భాగంగా ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు అర్హులు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన ప్రతిభా వంతులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా ప్రతీ విద్యార్థికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 7న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

180 మార్కులతో ప్రశ్నాపత్రం..

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ టెస్ట్ ఎంఏటీ ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ విధానంలో ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున ఇస్తారు. స్కాలర్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ కింద 90 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఫిజిక్స్ నుంచి 12, కెమిస్ట్రీ 11, బయాలజీ 12, గణితం 20, చరిత్ర 10, జాగ్రఫీ 10, పొలిటికల్ సైన్స్ 10, ఎకనామిక్స్ సబ్జెక్టు నుంచి 5 మార్కులు చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఈ ప్రశ్నలు అన్నీ 7వ తరగతి పూర్తి సిలబస్, 8వ తరగతిలో నవంబరు వరకు చెప్పిన సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. జనరల్, బీసీ, పీహెచ్ అభ్యర్థులు 40 శాతం అంటే 36 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 శాతం అంటే 29 మార్కులను ఎంఏటీ, ఎస్ఏటీలలో విడివిడిగా పొంది ఉంటేనే ఈ పరీక్షలో క్వాలిఫై అయినట్టు.

సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు



జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు చర్యలు తీసుకున్నాం. నెలాఖరు వరకు దరఖాస్తులకు గడువు ఉన్నందున మరింత మంది విద్యార్థులు పరీక్ష రాసే విధంగా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు ముందస్తు శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లా నుంచి ఎక్కువ మంది పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందే విధంగా పాఠశాలల్లోనే తర్ఫీదు పొందుతున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

బీర హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్, కోనసీమ జిల్లా

ప్రత్యేక తరగతులు



కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు జిల్లా నుంచి ఎక్కువ మంది పొందేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఏడాదికి రూ.12 వేలు చొప్పున పొందే ఉపకార వేతనం ఉన్నత విద్యకు ఆలంబనగా నిలుస్తుంది. ఎన్‌ఎంఎంఎస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఎవరికీ భారం కాకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి.

డాక్టర్ షేక్ సలీంబాషా, కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి

పరీక్ష రాసేందుకు అర్హతలు..

విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లక్షల లోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో 55శాతం మార్కులతోను, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం మార్కులు పొంది ఉండాలి. ఇక 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 863 ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 2817 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లాలో 289 పాఠశాలల్లో 11551 మంది 8వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 963 మంది దరఖాస్తు చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 252 పాఠశాలల్లో 12,167 మంది విద్యార్థులకుగాను 846 మంది, కాకినాడ జిల్లాలో 322 పాఠశాలల్లో 17,004 మంది విద్యార్థులకుగాను 1008 మంది దరఖాస్తు చేసుకున్నారు.

భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలి

'పీపీ' పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పరీక్షా కేంద్రాల్లో పటిష్ట నిఘాను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, అధికారులు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) వచ్చే నెల 5న కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శనివారం పరిశీలించారు. పరీక్ష సమయంలో భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల వ్యవస్థను సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు పూర్తిగా శిక్షణ పొందినవారై ఉండాలన్నారు. పరీక్షా సమయం ముందు, తరువాత యూనివర్శిటీ ప్రాంగణంలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆరంభ సమయానికి ముందే అభ్యర్థులు క్రమబద్ధంగా ప్రవేశించే విధంగా గేట్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ. సుబ్బారావు పేర్కొన్నారు. అనంతరం ఈసీఈ విభాగంలో ఉన్న పరీక్షా గదులను ఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఐజీ వెంట కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధుమాధవ్, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్, జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ కెవి.సత్యనారాయణ ఉన్నారు.

ఐశ్వర్యాంబిక అనుగ్రహించు...



అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణా నంద సరస్వతి

శ్రీపీఠంలో ఆరో రోజుకు మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో వేలాది మంది మహిళా మూర్తుల ఆధ్వర్యంలో 3వ మహాశక్తి యాగం-2025 వైభవంగా సాగుతోంది. అమ్మా ఐశ్వర్యాంబిక.. లలిత సహస్రనామంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలన్నీ మార్మోగుతున్నాయి. భక్తులను ఉద్దేశించి స్వామి పరిపూర్ణా నంద సరస్వతి మాట్లాడుతూ వెయ్యి కోట్ల లలిత సహస్రనామ కుంకుమార్చనతో చేపట్టిన ఈ మహాక్రతువులో భాగస్వామ్యమైన వారంతా ధన్యులేనన్నారు. మహా తపస్సులో వాక్కు, మనసు ముఖ్యమని, చేత్తో కుంకుమ పారాయణం చేస్తూ మీ శరీరాన్ని అమ్మవారికి అర్పించడం ముఖ్యమన్నారు. లలిత సహస్రనామానికి అనేక శక్తులు ఉన్నాయని, నత్తి ఉన్న వాళ్లు సైతం ఈ నామాన్ని 11 రోజుల్లో నేర్చుకుంటే స్పష్టం గా పలకగల మహాత్యం ఉంద న్నారు. శనివారం ఉదయం శ్రీపీఠంలో వేంచేసిన ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవీగా దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మంగళచండీ, రాజరాజేశ్వరి హోమాలు నిర్వహించారు. మహాశక్తి యాగం నిర్వహణ కోసం భాగస్వాములుగా ఉన్న పలువురు దాతలకు మహాశక్తి యంత్ర ప్రసాదాన్ని స్వామీజీ అందజేశారు. 18 దివ్య క్షేత్రాల గర్భాలయ అంత ర్భాగమైన శిలల నుంచి సేకరించిన వాటితో మహాశక్తి యంత్రాలను తయారు చేయించామన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనలేని వాళ్లు శ్రీపీఠం యూట్యూబ్ ఛానల్లో యాగం కార్యక్రమం లైవ్‌లో తిలకించాలని కోరారు. పూజల్లో సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వస్తామనుకోలేదు..

- 54 రోజుల పాటు బందీలయ్యాం
- సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, కూటమి ప్రభుత్వ సహకారంతో బతికి బయటపడ్డాం
- శ్రీలంక నుంచి కాకినాడకు పయనమైన మత్స్యకారులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

'వస్తామని ఊహించలేదు... జైల్లోనే మగ్గిపోతామనుకున్నాం.. అక్కడ జైలులో ఉన్న తమిళనాడు ఖైదీలను చూసి భయమేసింది. ఒక్కో జైలులో పాపం ఐదు వేల మంది ఉన్నారు. అందరూ కూడా మాలానే బోటు అదుపు తప్పి.. శ్రీలంక సముద్ర జలాల్లో దారి తప్పిన వారే. వారిలానే తాము కూడా ఉండాల్సి వస్తుందేమోననే భయం వెంటాడింది. కానీ ఇండియన్ ఎంబ సీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ఇతరుల సహకారంతో మేము బతికి బయటపడ్డాం.. కాకినాడ చేరుకోగలుగుతున్నాం" ఇదీ శ్రీలంక జైలు నుంచి విముక్తులైన మత్స్యకారుల మనోగతమి ది. శ్రీలంక సముద్రజలాల్లో చిక్కుకుని జాఫ్నా జైలులో సుమారు 54రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన మత్స్యకారులు ఎట్టకేలకు కాకినాడ బయల్దేరారు. ఈ సందర్భంగా వారు ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.



మత్స్యకారుల పడవతో కోస్ట్ గార్డ్ సిబ్బంది



మత్స్యకారులు

అసలేం జరిగిందంటే..

కాకినాడ జగన్నాథపురానికి చెందిన మత్స్యకారులమైన మేము కె.శ్రీను వెంకటేశ్వర్, కర్రి నూక రాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందం గత నెల ఆగస్టు 3న నాగపట్నం వెళ్లి ఓ పడవ కొనుగోలు చేశారు. "తిరుగు ప్రయాణంలో చీకటైపోయింది. గాఢాంధకారం.. చుట్టూ చీకటి.. నడిసంద్రంలో దారి తప్పిపోయాం. శ్రీలంక జలాల్లోకి ప్రవేశించాం. రామేశ్వరం వద్ద మూడు కిలోమీటర్లు శ్రీలంక పరిధిలోని సముద్ర జలాల్లోకి పడవ వెళ్లడాన్ని ఆ దేశ నేవీ అధికారులు మమ్మల్ని గుర్తించారు. శ్రీలంక ఫిషరీష్ అధికారుల వద్దకు మమ్మల్ని తీసుకుని వెళ్లారు. వారు మా వివరాలు తెలుసుకుని అన్నీ మాకు అనుకూలంగానే రాసుకున్నా రు. తర్వాత ఇండియన్ ఎంబసీ వచ్చి మా వివరాలు నమోదు చేసుకున్నారు భోజనం పెట్టి బాగా చూసుకున్నారు. మరుసటి రోజు ఉదయం జాఫ్నా పోలీసులకు అప్పగించారు. ఆగస్టు 4 నుంచి జాఫ్నా జైలులోనే ఉన్నాం. అక్కడ జైలులో ఐదు వేల మంది ఖైదీలు ఉన్నారు. వారిలో తమిళనాడుకు చెందిన వారే ఎక్కువ మంది. జైలులో వసతులు కూడా బాగానే ఉన్నాం.

సుమారు నాలుగుసార్లు కోర్టు వాయిదాలకు వెళ్లాం. చివరికి ఈనెల 12న అక్కడి కోర్టు విడుదలకు జడ్జి ఆదేశాలిచ్చారు. అయితే శ్రీలంక నేవీ, కోస్టుగార్డు అధికారులు ఆదేశించినా అప్పగింత ఆలస్యమైంది. తమిళనాడు ఖైదీలు జైల్లోనే మగ్గిపోతున్నారు. దారి తప్పిన తమిళనాడు మత్స్యకార బోట్లు సుమారు 500 వరకు అక్కడే ఉన్నాయి. వాళ్ల జడ్జి మమ్మల్ని వదిలేయడం చూసి ఆశ్చర్యపోయారు." అంటూ కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మత్స్యకారులు శ్రీలంకలో తాము ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. ప్రస్తుతం పాండిచ్చేరికి దగ్గరలో ఉన్నామని, 30వ తేదీ సాయంత్రానికి కాకినాడ చేరుకుంటామన్నారు. ఇక్కడంతా వాతావరణం వర్షం, ఉరుములు, మెరుపులతో భయంకరంగా ఉందని, గంట గంటకీ తమ క్షేమ సమాచారం మెసేజ్ కోస్ట్‌గార్డ్‌కు ఇస్తున్నామని, ముందు వెళుతోన్న షిప్‌ను అనుసరిస్తూ వస్తున్నామని కాకినాడకు తిరిగివస్తున్న కాకినాడ జగన్నాథపురం చంద్రిక థియేటర్, మల్లిపూడి వారి వీధికి చెందిన పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు(భైరవపాలెం, యానాం సావిత్రినగర్, కొప్పాడి శ్రీను ఏటిమొగ, కర్రి నూకరాజు(గంగవరం మండలం మనకపల్లి) పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

శ్రీలంక కోర్టు కాకినాడ మత్స్యకారులను విడుదల చేయాలని సెప్టెంబరు 12న ఆదేశించినా అక్కడ కోస్టుగార్డు, నేవీ అధికారులు సకాలంలో స్పందించలేదు. దీంతో బందీలైన మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. దీంతో వారు విషయాన్ని ఎంపీ సానా సతీష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లి మత్స్యకారులను స్వదేశానికి తీసుకువచ్చేలా చూడాలని కోరడం, ఆయన కోస్టుగార్డ్ కమాండర్ దినేష్‌జేతో చర్చించి విడుదలకు దారి చూపారు. శ్రీలంకలో బందీలైన తమ వారిని స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలకు మత్స్యకారుల కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

వెంకన్నకు ప్రత్యేక పూజలు

రూ.52.33 లక్షల ఆదాయం



శ్రీ వేంకటేశ్వరస్వామికి అలంకరణ

ఆత్రేయపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.52.33 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వాడపల్లి బస్టాండ్‌లో వేలాది మంది మహిళా భక్తులు ఉచిత బస్సు కోసం వేచిఉండి రాకపోకలు సాగించారు. ఆలయంలో, బస్టాండ్ లలోను ఎక్కువగా మహిళలే కనిపించారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

నిత్యాన్నదాన పథకానికి రూ.1.70 లక్షల విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం కోరుకొండ మండలం గాదరాడకు చెందిన బాదం చక్రవర్తి, సీతామహాలక్ష్మి రూ.1.70 లక్షల విరాళం ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, భక్తులు ఉన్నారు.

గాయత్రి అలంకరణలో రత్నగిరి దుర్గలు



అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై ఉన్న వనదుర్గ, తొలిపావంచా వద్ద కొలువైఉన్న కనకదుర్గలు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లలితాదేవిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ దేవస్థానంలో శనివారం శ్రీ లలితా దేవిగా దర్శనమిచ్చారు.పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



ఇద్దరు దొంగలు.. 97 చోరీలు..

అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకున్న బొమ్మూరు పోలీసులు

రూ.9.98 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగల ఆటకట్టించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు ఫ్రూట్ మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న క్యానం అన్వేష్ కుటుంబంతో తల్లి అస్తికలు కాశీలో కలపడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూం చిందరవందరగా ఉంది. బంగారం వస్తువులు, నగదు కనిపించలేదు. దీనిపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సీఐ కాశీ విశ్వనాథ్ తన బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండ గా పట్టుకున్నారు. వాళ్లను ప్రశ్నించి ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని నిర్ధారించుకు న్నారు. దీంతో ఒడిశాలోని జాగ్మోరా భువనేశ్వర్‌కి చెందిన ప్రశాంత కుమార్ కరాడా, గంజాంకు చెందిన సాగర్ కుమార్ పాండాను అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ ఇద్దరూ 2000వ సంవత్సరం నుంచి నేరాలు చేస్తున్నారు. విశాఖ పట్నం ప్రాంతంలో 11, కాకినాడ 4, గుంటూరు 3, ఒడిశాలోని బరంపురం 5, భైద్యనాథ్ 4, బడా బజార్ 5, గుస్సాన్ 8, హైదరాబాద్‌లోని కూక ట్‌పల్లి 6, నాగ్‌పూర్ ప్రతాప్‌నగర్‌లో 10తో కలిపి సుమారు 97 కేసులు ఉన్నాయి" అని డీఎస్పీ తెలిపారు. ప్రశాంత్ కుమార్ కరుడుగట్టిన దొంగ అని, నాలుగేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడని చెప్పారు. కలకత్తాలో ఓ సారి కాల్పులు కూడా జరిపాడన్నారు. నిందితుల నుంచి రూ.9.98 లక్షల విలువైన నగదు, నగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. క్లిష్టమైన కేసును నెల రోజుల్లో పరిష్కరించడంలో ప్రతిభ చూపిన సీఐ కాశీ విశ్వనాథం, ఎస్ఐ మురళీ మోహన్, హెచ్‌సీలు వెంకటేశ్వరరావు, ప్రసాద్, వెంకట రమణ, పీసీలు సురేశ్ బాబు, మనికంఠ, హరీశ్, పూర్ణిమా రాజ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన రంగబాబు

గండేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం జాతీయ రహదారిపై మోటారుసైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల ప్రకారం.. గండేపల్లి గ్రామానికి చెందిన బోసన కూరి రంగబాబు(40) గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం పని నిమిత్తం వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు క్షతగాత్రుడిని జీఎస్ఎల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్ఐ శివనాగబాబు నెంబరు బోర్డు ద్వారా కారుని వెంబడించడంతో ఆచూకీ లభ్యమైంది. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త ఆత్మహత్య

తొండంగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో జరిగింది. ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ శివ (34)కు ఎలమంచిలి మండలం గుండురుబిల్లికి చెందిన దుర్గతో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. తొండంగి మండలం ఒంటిమామిడి వచ్చి జీవిస్తున్నారు. శివ ప్రస్తుతం తొండంగి గ్యాస్ ఏజన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో దుర్గ తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, తేజలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను తిరిగి వచ్చేయమని శివ ఫోనులో కోరేవాడు. ఆమె ఎంతకీ తిరిగి రావకపోవడంతో మనస్తాపం చెందిన శివ శనివారం ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి భార్యకు తెలిపారు. దీనిపై దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల ముసుగులో దొంగతనాలు

అన్నవరంలో ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులు

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భక్తులే వారికి టార్గెట్. రత్నగిరిపై వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టే సమయంలో జేబులో నగదు, చేతికి ఉంగరాలు, ఇతర వస్తువులు చాకచక్యంగా కొట్టేస్తుంటారు. కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో భక్తుల ముసుగులో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూ.300 వ్రత మండపం వద్ద ఈ విధంగా చేయడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అన్నవరం ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.11500 సొత్తును స్వాధీనం చేసుకుని, హైదరాబాద్‌కు చెందిన భక్తుల నగదుగా గుర్తించి వారికి అందజేశారు. నిందితులను గుంటూరు జిల్లా తాడేపల్లి సెంటర్‌కు చెందిన ఇట్ట సత్యనారాయణ, బాలసాని వెంకటభాస్కరరావుగా గుర్తించినట్టు సమాచారం. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ నిందితులు గతంలో చేపట్టిన నేరాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద గోదావరిలో శనివారం సాయంత్రం యువకుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశా రు. మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ ఆరు రోజుల క్రితం రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్‌ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా మునిగిపోయి గల్లంతు అయినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసి తరలించారు.

డొంకరాయి 7వ గేటు ఎత్తివేత



విడుదలవుతున్న వరద నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి ప్రధాన ఆనకట్ట 7వ గేటును 2.90 అడుగుల మేర ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యామ్ ఏఈ శివశంకర్ తెలిపారు. ఈ ప్రధాన ఆనకట్ట గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు కాగా గత వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శనివారం సాయంత్రానికి ఆనకట్ట నీటి మట్టం 1035.60 అడుగులకు చేరుకుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. రాత్రంతా పెట్రోలింగ్ చేస్తూ నీటి మట్టం సాధారణ స్థితికి వచ్చిన తర్వాత గేటును మూసివేస్తామన్నారు.

వరద గోదారి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 236 మంది మత్స్యకారులు పునరావాస కేంద్రానికి తరలింపు
- 'తూర్పు' కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం/కె.గంగవరం/రావులపాలెం/ఆలమూరు/చింతూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో దిగువన గోదావరిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోందని, ఇంకా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 5గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామన్నారు. రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. కాటన్ బ్యారేజ్, ఆల్కాట్ గార్డెన్స్, గౌతమీ ఘాట్ తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సమీక్ష చేశారు. లంకల్లోని 236 మంది మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కలెక్టర్ సూచించారు.రాత్రి 8గంటలకు కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం 12.10 అడుగులకు చేరింది. ఇది 13.75కి చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు ఎత్తివేసి 10,25,073 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా కె.గంగవరం మండలం కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవు,స్థానిక పుష్కరాల రేవులోని మెట్లు మునిగిపోయాయి.రావులపాలెం మండల పరిధిలోని గౌతమి, వశిష్ట పాయలలో గోదావరి వరద క్రమంగా పెరుగుతోంది. దీంతో పల్లపు లంక ప్రాంతాలు మరోమారు ముంపుబారిన పడుతున్నాయి. ఆలమూరు మండలంలోని లంక గ్రామాలైన బడుగువానిలంక, చెముడులంక, చొప్పెల్ల, మడికి, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుకుంది. జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్ నీట మునిగింది. జొన్నాడ బ్రిడ్జిల మధ్య వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.



రావులపాలెం వద్ద వరద ఉధృతి



చింతూరు: నిమ్మలగూడెం-కుయుగూరుల నడుమ ప్రధాన రహదారిపై వరద నీరు

కాసింత తగ్గిన గోదావరి

చింతూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి కాసింత తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం 6గంటలకు 46.60 అడుగులుగా ఉన్న నీటి మట్టం సాయంత్రం 6గంటలకు 44.30 అడుగులకు తగ్గింది. గోదావరి ఉధృతితో శబరి నది ఎగపోటుకు గురైంది. దీంతో చింతూరు డివిజను లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.చింతూరు-వరరామచంద్రపురం, చింతూరు-కూనవరం, కూనవరం-ఎటపాక ప్రధాన రహదార్లపై వరద నీరు చేరింది. కూనవరం, ఎటపాక మండలాల్లో మిర్చి తోటలు నీట మునిగాయి. 326వ నెంబరు జాతీయ రహదారి చింతూరు మండలం, నిమ్మలగూడెం,కుయుగూరుల నడుమ నీట మునిగింది.

రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా
నేడు పోతంశెట్టి ప్రమాణస్వీకారం



రావులపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, రాజా పురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. రావులపాలెంలో పోతంశెట్టి విద్యా, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ విద్యా అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పాతికేళ్లపాటు పని చేశారు. గ్రామ విద్యాకమిటీ అధ్యక్షుడిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యా విధానంలో అనేక మార్పులను తీసుకొచ్చారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇప్పించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. పలుమార్లు బాలుర, బాలికల జోన్, సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పలు సేవలందించారు. ఆధ్యాత్మిక రంగంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా జీర్ణావస్థలో ఉన్న మునలి రామాలయం స్థానంలో సీతారామచంద్రస్వామి, శిరిడిసాయి ఆలయా లు, అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఏటా స్వామివారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.కొత్తపేట నియోజకవర్గ టింబర్ అండ్ బ్యాంబూ సామిల్లు అసోసియేషన్ అధ్యక్షుడిగా అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టింబర్ మర్చంట్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ వస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో 15ఏళ్లుగా తెలుగు వర్తకుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ తెలుగు వర్తకుల సౌకర్యం కోసం జగదల్పూర్‌లో రూ.కోటితో భవన నిర్మాణం చేపట్టారు.

సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

బిక్కవోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రంగాపురంలో సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ శనివారం తెలిపారు. గ్రామంలో దాడులు నిర్వహించగా యదల రాంబాబు, మాదబోయిన రాముడుల వద్ద 20 లీటర్ల సారా ఉందని, దీంతో సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

కనీస సౌకర్యాలపై తొలి నివేదిక

శాసనసభ సభ్యుల సదుపాయాల కమిటీ సభ్యుడు నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శాసన సభ, శాసన మండలి, మాజీ సభ్యులకు అత్యవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి సౌకర్యాల కమిటీ తొలి నివేదికను అందించినట్టు సౌకర్యాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం శాసన సభలో ఆయన సౌకర్యాల కమిటీ తొలి నివేదికను సభకు సర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులకు, మాజీ సభ్యులకు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే కమిటీ ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేస్తే బావుంటుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన సూచనల మేరకు కమిటీ సభ్యులు పలు అంశాలను కూలంకుషంగా చర్చించి ఈ అంశాలను ప్రభుత్వానికి సిఫారసు చేశామన్నారు. పలు విషయాలపై వివిధ రాష్ట్రాల శాసన వ్యవస్థల నుంచి సేకరించిన సమాచారంతో అధ్యయనం చేసిన తరువాత మాజీ ఎమ్మెల్యేలకు మణిపూర్‌లో రూ.70 వేలు అరుణాచల్‌లో రూ.50 వేలు, హరియాణా, తెలంగాణలలో కనీసం రూ.50 వేలుగా ఉందన్న విషయాన్ని పరిగణలోకి తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరి మాజీ సభ్యుల ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉన్న వాస్తవాన్ని గుర్తించి ఏపీలో కనీసం నెలసరి పించను రూ.30 వేలు నుంచి రూ.50వేలకు పెంచాలని కమిటీ సిఫారసు చేసిందన్నారు. అలాగే ప్రస్తుత, మాజీ సభ్యులకు అఖిల భారత సర్వీస్ అధికారులతో సమానంగా వైద్య సదుపాయాల కల్పనకు కమిటీ సిఫారసు చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన



శిబిరంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిస్సా, పంజాబ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేవిధంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. తమ రాష్ట్రాల ప్రత్యేక సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతీ బృందం హైలెట్ చేసింది. అలాగే భారత్ దృష్టిలో ఎన్‌సీసీ సహకారం అనే అంశంపై రంగోళి పోటీ నిర్వహించారు. ప్రగతి శీల, ఐక్యమైన స్థితిస్థాపక భారతదేశాన్ని రూపొందించడంలో ఎన్‌సీసీ క్యాడెట్ల పాత్రను చిత్రీకరించేందుకు ఈ పోటీలు ప్రోత్సాహాన్నిచ్చాయి. ఏడు డైరెక్టరేట్ల నుంచి క్యాడెట్లు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం అగర్వాల్‌కు క్యాడెట్లు గౌరవవందనాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ హెచ్ఎస్ మాణిక్, సుబేదార్ మేజర్ మణిదీప్ సింగ్, శిబిరం సూపరింటెండెంట్ శేషేంద్ర, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బేరింగుల దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు. ఎస్.కొత్తపల్లికి చెందిన కోడూరు సుబ్బారావు గ్రామంలో ట్రాక్టర్ విడిభాగాల వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఇంటిని, వ్యాపారాన్ని గ్రామానికి చెందిన వాతాడ వెంకటేశ్వరరావుకు అప్పగించి ఇటీవల సుబ్బారావు హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నెల 21న దొంగలు రూ.36 వేలు విలువ చేసే ట్రాక్టర్ బేరింగ్‌లు చోరీ చేశారు. కాగా దొంగిలించిన బేరింగ్‌లతో శనివారం ఆటోలో వెళ్తున్న యలమంచిలి శివరావు, లంకే బ్రహ్మాజీ, ఆదివారపుపేట గణపతిలను పట్టుకుని ఆటో సీజ్ చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి అమలాపురం కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

మహాచండీయాగం



కడియం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రులు సందర్భంగా కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పలి శ్రీ మన్నారాయణ ఆధ్వర్యంలో యాగం వైభవంగా జరిగింది. అమ్మవారికి కలశ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. దుళ్ల మార్కెట్ సెంటర్‌లో శారదాదేవీ ఆలయం వద్ద మహాచండీహోమం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

బాపనమ్మకు పంచామృతాభిషేకం..

గోకవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అచ్చుతాపురం గ్రామదేవత బాపనమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన జరిపి అమ్మవారిని కాత్యాయనిదేవి అలంకరించారు. గోకవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా మండలి కుంకుమ పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీవీ రామకృష్ణ, నల్లల శ్రీనివాస్, గుర్రాల రత్నాజీరావు, మాదేటి బాబూరావు, తమ్మన మావాజీలు, మాదేటి శ్రీను పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా శ్రీరాజరాజేశ్వరి..

బిక్కవోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు జువ్వలదొడ్డిలోని శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. కొంకుదురు గోపాలనాయుడు వీధిలో చండీ హోమం నిర్వహించారు. బాలభక్త సమాజం ఆధ్వర్యంలో కమిటీ సభ్యుడు చిన్నం శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో దంపతులు, భక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రూ.31.25 లక్షల రుణాలు

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరంలో లోక్ కళ్యాణ్ మేళా



రుణాల చెక్కును అందిస్తున్న ఏసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వివిధ రకాల ఉత్పత్తులను వీధి విక్రయాలు చేసే 81 మందికి రూ.31.25 లక్షల రుణాలను నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెప్మా పీడీ టి.కనకరాజు అందజేశారు. శనివారం స్థానిక ఆనం కళా కేంద్రంలో జరిగిన లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమానికి అడిషనల్ కమిషనర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వీధి వ్యాపారులు ఉత్పత్తుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారంలో రాణించాలన్నారు. రుణగ్రహీతలు బ్యాంకుల ద్వారా రుణం పొందడం ద్వారా ప్రభుత్వ రాయితీలను పొందే అవకాశం ఉంటుందన్నారు. వీధి వ్యాపారులు, చిరువ్యాపారులకు పీఎం స్వనిధి 2.0 ద్వారా మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేలు వరకు రుణాలు అందనున్నాయన్నారు. కనకరాజు మాట్లాడుతూ 2020 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకాన్ని పునఃరూపకల్పన చేసి పీఎం స్వనిధి 2.0 పథకం కింద జిల్లాలో కొత్తగా దరఖాస్తులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. ఈ మేళా ద్వారా వీధి వ్యాపారులు, వారి కుటుంబీకులకు 8 అంశాల్లో ప్రభుత్వం పథకాల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తుందన్నారు. తొలుత మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రూక్కయ్య, లీడ్ బ్యాంక్ మేనేజరు ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రకాష్, యూనియన్ బ్యాంక్ ఎఫ్‌సీసీ ఇన్‌చార్జి చిట్టితల్లి, సీఎంఎం రామలక్ష్మి, శానిటేషన్ సూపర్‌వైజర్ రెడ్డి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, నాయకులు కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, సత్యనారాయణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దల ఆశయాలు నెరవేర్చాలి

రాజమహేంద్రవరం పందిరి మహదేవుడు సత్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక పందిరి మహదేవుడు సత్రం (కోటిలింగాల సత్రం) స్థాపించిన పెద్దల ఆశయాలు నెరవేర్చేవిధంగా నూతన పాలక వర్గం పనిచేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం పందిరి మహదేవుడు సత్రం నూనత పాలక మండలి చైర్మన్ రెడ్డి మణేశ్వరరావు, సభ్యులతో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన ప్రమాణస్వీకారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. హిందూ దేవాలయాల అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 1976లో స్థాపించిన కోటిలింగాల సత్రం ఎంతో పేరుగాంచిందని, నూతన పాలక వర్గం ఈ సత్రం అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమానికి బాధ్యతతో పనిచేయాలన్నారు.కార్యక్రమంలో వర్రే శ్రీనివాసరావు, కాశి నవీన్‌కుమార్, వై.శ్రీను, అనుశ్రీ సత్యనారాయణ, పిక్కి నాగేంద్ర, చల్లా శంకర్రావు, జవ్వాది మురళీకృష్ణ, రవియాదవ్ పాల్గొన్నారు.

ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దుతాం

బూరుగుపూడి సొసైటీ చైర్మన్ నాగ కేశవరావు



సమావేశంలో మాట్లాడుతూ కేశరరావు

కోరుకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలం బూరుగుపూడి వ్యవసాయ సొసైటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని సొసైటీ చైర్‌పర్సన్ కంటే నాగ కేశవరావు అన్నారు. సొసైటీ రైతు మహాజన సభ శనివారం మధ్యాహ్నం సొసైటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు సొసైటీ ప్రగతిని వివరించారు. సమావేశంలో పర్సన్ యర్రంశెట్టి సూర్యనారాయణ, బాలిన వెంకటేశ్వర్లు, సొసైటీ సీఈవో ఈదల సుదర్శనరావు, అడపా శ్రీనివాస్, ఏవీ సూర్యనారాయణ, పేలేపల్లి రామారావు, చెరుకూరి విష్ణు పాల్గొన్నారు.

గాడాల సొసైటీకి నూతన భవనాన్ని నిర్మిస్తాం



సమావేశంలో మాట్లాడుతూ మోహన్‌రావు

గాడాల సొసైటీలో జరిగిన మహాజన సభలో చైర్మన్ పడాల మోహన్‌రావు మాట్లాడారు. పీఏసీఎస్ సంఘానికి నూతన కార్యాలయ భవనాన్ని, ఎరువుల గొడౌన్‌ను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రగతిని వివరించారు. కాగా సొసైటీలో 600 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, ఈ ఖరీఫ్ సీజన్‌లో 150 టన్నుల యూరియాను అందజేశామన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు తిరుమల నాధుని వెంకటేశ్వరరావు, పీవీవీ సత్యనారాయణ(పండు), సీఈవో ఏడుకొండలు, రైతులు ఆచంట కాపు, మాగాపు సత్యనారాయణ, అడ్డాల శివ సూర్యనారాయణ, గాదం శెట్టివెంకన్న, మాదవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి

రూ.3.60 కోట్లు మంజూరు: బత్తుల

సత్యసాయి డ్రింకింగ్ వాటర్ పథకానికి మరో రూ.కోటి

రాజానగరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మంచి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.3.60 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో కోరుకొండ మండలం గాదరాడ, రాజానగరం మండలం ముక్కినాడ, మల్లంపూడి, దివాన్‌చెరువు, సీతానగరం మండలం రామచంద్రపురం, పురుషోత్తపట్నం, చినకొండేపూడి, కూనవరం గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అలాగే సత్యసాయి తాగునీటి పథకానికి రూ.కోటి నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులను సిబ్బంది జీతాలు, పథకం నిర్వహణకు ఖర్చు చేస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రికి గెయిల్ డస్ట్‌బిన్‌ల విరాళం



రాజమమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17నుంచి జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంలో రాజమండ్రిలోని గెయిల్ ఇండియా లిమిటెడ్ స్థానిక ప్రభుత్వాసుపత్రికి పొడి తడి వ్యర్థాల సేకరణ కోసం డస్ట్‌బిన్‌లు విరాళంగా ఇచ్చింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కోసం క్లాత్ బ్యాగ్‌లను కూడా పంపిణీ చేసింది. కార్యక్రమంలో గెయిల్ జనరల్ మేనేజర్ కేబీ నారాయణ, డీజీఎం ప్రభాకర్ దివి, మేనేజర్ వైవీ ఎస్ మూర్తి, గోపీచంద్‌నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. బి.సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంవో సుబ్బారావు పాల్గొన్నారు.

‘డిమాండ్లు నెరవేర్చకుంటే ఆందోళన’

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళనకు దిగుతామని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్(ఏఈపీపీహెచ్‌సీడీఏ) శనివారం ఓ ప్రకటనలో అన్నారు. ఇప్పటికే అధికారులకు నోటీసులు అందించామని, అయినా వారి నుంచి స్పందనలేకపోవడంతో ఆందోళన ప్రణాళిక వారు ప్రకటించారు. ఇప్పటికే అన్ని ఆన్‌లైన్ రిపోర్టింగ్ పనులు నిలిపివేశామన్నారు. ఎస్ఎన్ఎస్‌పీఏ, సంచార చికిత్స, ఇతర క్యాంప్ డ్యూటీలు బహిష్కరించినట్టు పేర్కొన్నారు.

మాజీ ఎంపీటీసీ వెంకట్రావు మృతి



గోకవరం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గోకవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి వెంకట్రావు(పోలీస్ వెంకట్రావు)(92) శనివారం మృతి చెందారు. ఈయన కొంతకాలంగా వృద్ధాప్యంతోపాటు, అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. 2000-05లో ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వెంకట్రావు మృతి పట్ల మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నందరాడ సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



రాజానగరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నందరాడ సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది.చైర్మన్‌గా నందరాడకు చెందిన గోలి రాజా, సభ్యులుగా నరేంద్రపురానికి చెందిన చవిటిపల్లి సూర్యనారాయణ, పిల్లా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిప్రోలు పద్దరాజు, బోళ్ల మో హన్, చిట్టిప్రోలు సత్తిబాబు, ఆళ్ల శివ నాగరాజు, సీఈవో బోళ్ల సూర్య చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.కృష్ణవేణి అన్నారు. రంగంపేటలో రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా రంగంపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాస, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గారపాటి రాంబాబు, డైరెక్టర్ దూబాసి వరప్రసాద్, ఎంపీహెచ్ఎం జి.ప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్‌వీ రమణాంజలి పాల్గొన్నారు.

నవంబరులో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర 24వ మహాసభలు నవంబరులో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశానికి ఆయనతోపాటు ప్రొఫెసర్ టి.సత్యనారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా పీడీఎస్‌యూ మాజీ నాయకుడు న్యాయవాది ఎస్.లక్ష్మణరావు, ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా భానుచందర్‌ను ఎన్నుకున్నారు.

19 వరకు సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్: డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ ప్రత్యేక ప్రచార కార్యక్రమం వచ్చేనెల 19వరకు జరుగుతుందని డీఎం హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.బొమ్మూరులోని ఆ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రచారం ద్వారా వినియోగదారులకు,వ్యాపార వర్గాలకు జీఎస్‌టీ సంస్కరణలు,ప్రయోజనాలతోపాటు మందులు, వైద్య పరికరాలు, ఆరోగ్యబీమా ధరలకు తగ్గింపులను తెలియజేయడం ప్రధాన లక్ష్యమన్నారు.





అమ్మా భవానీ..

కొవ్వూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుందర గణేష్ శనివారం అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. చండీహోమం నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ధనలక్ష్మిగా..

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):దసరా ఉత్సవాలను గత ఆరు రోజులుగా ఊరూవాడా ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. భక్తులు దర్శించుకుని పూజలు చేస్తున్నారు.. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.. ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్ర వరం రాజేంద్రనగర్ సమీపంలోని నెహ్రూనగర్ కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు రూ.35 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందులో రూ.500, రూ.200, రూ.100 నోట్లు ఉన్నాయి. అమ్మవారిని ముస్తాబు చేసిన తీరు ఆకట్టుకుంది. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని అలంకరించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ వద్ద ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ దేవకుమార్ తదితరులు

ఊళ్లకు చెప్పి వెళ్లండి!

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టామని.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల కారణంగా దొంగతనాలు జరుగుతున్నాయని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ శనివారం పరిశీలించి మాట్లాడారు.ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగలు వృద్ధులు, ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నారన్నారు. ఇటీవల నల్లజర్ల, తణుకులో ఇదే తరహాలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. దొంగలను గుర్తించామన్నారు. సెలవులు పురస్కరించుకుని ఊళ్లకు వెళుతున్న వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చి లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఎక్కువగా నగదు, బంగారం ఉంచకూడదని అన్నారు. నిడదవోలు పోలీస్ సర్కిల్ పరిధిలోని సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన వెంట రాజమండ్రి ఎస్పీ డి.నరసింహ కిశోర్, కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ బాలాజీ సుందరరావు ఉన్నారు.



అకీరా మియావాకీ మొక్కల పెంపకాన్ని పరిశీలించి.. మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

అకీరా మియావాకీతో మేలు

రాజానగరంలో కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలన

రాజానగరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ, వనరుల సంరక్షణలో అకీరా మియావాకి మొక్కల పెంపకం గొప్ప ఆలోచనా విధానమని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలో 25 సెంట్లలో చేపట్టిన అకీరా మియావాకి మొక్కల పెంపకాన్ని, ఫామ్ పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అకీరా మియావాకి మొక్కల పెంపకం అద్భుత ఆలోచనా విధానమని కొనియాడారు. అకీరా మియావాకి మొక్కల పెంపకానికి 2970 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. వాటిలో జామ, వెలగ, బిల్లా, మర్రి, నర్రగిలగిల, మద్ది చెట్టు, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధ తరగ తదితర మొక్కలు నాటడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఆమె వెంట డ్వామా ఏపీడీ రాంప్రసాద్,ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, డ్వామా సిబ్బంది ఉన్నారు.

ఈవీఎం గోదాములు కలెక్టర్ పరిశీలన

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఈవీఎం గోదాములను కలెక్టర్ కీర్తి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి,తనిఖీలు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు నిరంతర సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణనాయక్, తహశీల్దారు పాపారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో వరద పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి తెలిపారు. శనివారం సాయంత్రం 5గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. కాటన్ బ్యారేజ్, ఆల్కట్ గార్డెన్స్, గౌతమి ఘాట్ తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.లంకల్లోని 236 మంది మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సహాయం అవసరమైతే వెంటనే అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు.

రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం


కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉద్యోగులు

తాళ్లపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశపు మందిరంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పీ. గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ 15 పీఆర్‌సీలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 11 మాత్రమే ఇచ్చిందన్నారు. కనీసం 12వ పీఆర్‌సీకి కూడా కమిషన్‌ను నియమించకపోవడం ఆందోళనకరమని, ఈ విషయంలో ఏపీజీఈఏ ఉద్యోగుల పక్షాన పోరాడుతామన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన 25 వేల కోట్లను వెంటనే విడుదల చేయడానికి తగిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని వైద్యశాఖ సిబ్బంది, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరికిరేవుల సొసైటీ సభ్యులకు 15 శాతం డివిడెంట్

• సొసైటీ అధ్యక్షుడు చావా రామకృష్ణ శ్రీనివాసరావు వెల్లడి


మహజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

కొవ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరికిరేవుల సొసైటీ సభ్యులకు 15 శాతం డివిడెంట్ అందిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు చావా రామకృష్ణ శ్రీనివాసరావు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ శనివారం జరిగింది. దీనిలో భాగంగా సొసైటీ కార్యదర్శి చావా ప్రసాద్ వార్షిక నివేదికను వివరించారు. రామకృష్ణ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సొసైటీ సభ్యులకు రూ. 12,87,560 నికర లాభం పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమావేశం అనంతరం రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, నీటి సంఘం అదక్షుడు గొరిజాల సురేష్, ఎంపీటీసీ అల్లు వెంకటరమణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

గోపాలపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ వస్తువులపై ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని మండల ప్రత్యేకాధికారి టీ.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం వివిధవస్తువులపై జీఎస్టీ తగ్గించిందన్నారు. దీంతో వినియోగదారులకు అధిక లాభం కలగుతుందన్నారు. దీనిపై ఆయా పంచాయతీల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా వస్తువులతో పాటు నిత్యవసర సరుకులకు ఈ జీఎస్టీ వర్తిస్తుందన్నారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్.సుజాత, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ జీ. సందీప్ తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరుగుతుందన్నారు. పట్టణంలోని 23 వార్డులలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు

• పలు చోట్ల చండీహోమాలు, సామూహిక కుంకుమ పూజలు


లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో జ్ఞాన సరస్వతి అమ్మవారు

కొవ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుందర గణేష్ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమపూజలు, చండీహోమాన్ని నిర్వహించారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందినర ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నిడదవోలు: తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ దేవస్థానంలో శనివారమైన ఆరోరోజు దేవీ నవరాత్రులు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీపారాయణం, సాయంకాలం చండీహోమం నిర్వహించారు. సుమారు 267 మంది దంపతులు అమ్మవారి ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. స్వర్ణాభరణ, ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని మూడు వేల మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేవరపల్లి: మండలంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవార్లకు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లను లలితత్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మూడు బొమ్మల సెంటర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక ఆలయం వద్ద చండీహోమం నిర్వహించారు. బాలదుర్గమ్మ ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరపల్లికి చెందిన పడాల వెంకటసురేశ్, సింధూజ దంపతులు రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పల్లంట్లలో దసరా మహోత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన నలమాటి నాగేశ్వరరావు, శ్రీదేవి దంపతులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కొత్తగూడెంలో కోదండ రామాలయం వద్ద దసరా మహోత్సవాలు సందర్భంగా కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. కూచిపూడి నృత్య గురువు రామచరణ్, నలమాటి లలిత, తదితరులు పాల్గొన్నారు.

రేపు లోక్ కల్యాణ్ మేళా

కొవ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వీధి విక్రయదారులకు లోక్‌కల్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్టు కమిషనర్ జీ.సందీప్ తెలిపారు. వారి అర్హతను బట్టి 8 పథకాలు అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఆయా పథకాల గుర్తింపు, ఆరోగ్యకార్డులు అందజేయడంతో పాటు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పిస్తారన్నారు. పీఎం స్వానిధి కింద మొదటిసారి రుణం తీసుకునే వారికి రూ. 15 వేలు, రెండోవిడత రూ. 25 వేలు, మూడో విడత రూ. 50 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యాపారులు తమ ఆధార్, పాన్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లు, ఫోన్ నెంబరు తీసుకురావాలన్నారు. దీన్ని వీధి విక్రయదారులు సద్వినియోగించుకోవాలన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

పెరవలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కానూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు కే. హేమరాజు, పీ. తేజశ్రీ పాల్గొని పలువురు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ గుడాల రంగారావు, కార్యదర్శి ఇందుకూరి గంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకం

నల్లజర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ కీలకమని తహశీల్దార్ నాయుడు అన్నారు. ఏకేఆర్‌జీ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులంతా జూనియర్స్‌కు స్వాగతం పలికారు. దీనికి తహశీల్దార్ నాయుడు, ఎస్ఐ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ వడ్లమూడి రామారావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ టీ. రామారావు, డిగ్రీ ప్రిన్సిపాల్ శివరాం, పార్మసీ ప్రిన్సిపాల్ నల్లజర్ల సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ : మంత్రి సుభాష్


చాగల్లులో బాల కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, తదితరులు

చాగల్లు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉంటుందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రాత్రి చాగల్లు విచ్చేసి నూతనంగా నిర్మాణం చేసిన శ్రీరాజరాజేశ్వరి కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అనంతరం పక్కనే ఉన్న వల్లుగుంట శ్రీనకదుర్గమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం పాటిమ్మపేటలోని బాల కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ అళ్ల హరిబాబు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, పంచాయతీ సభ్యులు దొంగ రమ్యశ్రీనివాస్, ఉత్సవకమిటి సభ్యులు, శెట్టిబలిజ కుల సంఘం పెద్దలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కాల్ధరి, చివటంలో వైద్యశిబిరాలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాల్ధరి, చివటంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్లు వై. సృజన, ఆర్. ఉషాదేవి పాల్గొని రోగులకు పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు రోగులతో మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని చెప్పారు. దీనిలో భాగంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చీపుళ్ల కుమారి, నాయకులు బి. శివరామకృష్ణ, మద్దిపాటి వెంకటేశ్వరరావు, అబ్బిన కాశీవిశ్వనాధం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు : చైర్మన్


మాట్లాడుతున్న పోతవరం సొసైటీ చైర్మన్ పసుమర్తి ప్రభాకరరావు

నల్లజర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందుబాటులో ఉందని పోతవరం సొసైటీ చైర్మన్ పసుమర్తి ప్రభాకరరావు అన్నారు.శనివారం సొసైటీ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. కార్యదర్శి కావూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న క్రాప్ లోన్ ఏడాది లోపు చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఆలపాటి శేషరత్నం, కండెల్లి గోతియ్య, తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా నేడు పోతంశెట్టి ప్రమాణస్వీకారం



రావులపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా రాజా పురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. రావులపాలెంలో పోతంశెట్టి విద్యా, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ విద్యా అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పాతికేళ్లపాటు పనిచేశారు. గ్రామ విద్యాకమిటీ అధ్యక్షుడిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యా విధానంలో అనేక మార్పులను తీసుకొచ్చారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇప్పించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. పలుమార్లు బాలుర, బాలికల జోన్, సెంట్రల్ జోన్ క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పలు సేవలందించారు. ఆధ్యాత్మిక రంగంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జీర్ణావస్తలో ఉన్న ముసలి రామాలయం స్థానంలో సీతారామ చంద్ర స్వామి, శిరిడిసాయి ఆలయాలు, అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఏటా స్వామివారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ టింబర్ అండ్ బ్యాంబూ సామిల్లు అసోసియేషన్ అధ్యక్షుడిగా అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టింబర్ మర్చంట్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ వస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో 15 ఏళ్లుగా తెలుగు వర్తకుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ తెలుగువర్తకుల సౌకర్యం కోసం జగదల్పూర్‌లో రూ.కోటితో భవన నిర్మాణం చేపట్టారు.

కళాశాలలకు నూతన భవనాలు నిర్మించాలి

• అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం తన వాణి వినిపించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గల జూనియర్ కళాశాలల్లో విదార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలలు ప్రారంభంలో నిర్మించిన భవనాలు కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో తరగతులు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. తాత్కాలికంగా దాతల సహకారంతో మరమ్మత్తులు చేపట్టాం. సంబంధిత మంత్రికి ఈ విషయాన్ని తెలియజేరు. రెండోది కొవ్వూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు శాశ్వత భవనాలు లేక తాత్కాలికంగా జూనియర్ కళాశాలలో నడుస్తుంది. 2025 జూలై 1న నియోజకవర్గానికి విచ్చేసిన సీఎంకి తెలియజేయగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నిధులను త్వరిగతిన మంజూరుచేసి భవన నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.

శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎమ్మెల్యే



గోపాలపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధనికుడైన, నిరుపేదైన చివరికి కలిసేది మట్టిలోనేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళగిరిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో శనివారం ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంప్రదాయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా మృతిచెందిన వారిని శ్మశాన వాటికలోనే దహనం చేయడం సర్వసాధారణమన్నారు. నేడు వాటిల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పెరుగుతు న్న జనాభాకు అనుగుణంగా శ్మశానవాటికలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో పంచాయతీల ద్వారా పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు వంటివి కనీస సౌకర్యాల కల్పనకు ఏ విధంగా కృషి చేస్తున్నాయో, అలాగే శ్మశానవాటికలను సైతం గ్రామ పంచాయతీలకు అప్పగించి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితి గోపాలపురం నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

గామన్ బ్రిడ్జి టోల్‌గేటు నిర్వాహకుల ఔదార్యం

• విజయవాడ నడిచివెళ్తున్న భవానీలకు అన్నదానం


టోల్‌గేటు వద్ద భవానీలకు అన్నదానం చేస్తున్న పాత్ ఫౌండేషన్ సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని విజయవాడ కనకదర్గమ్మను దర్శించుకోవడానికి నడిచివెళ్తున్న భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు పాత్ ఫౌండేషన్ మేనేజర్ రాజీవ్‌సింగ్ తెలిపారు. పట్టణంలోని గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద రాజమహేంద్రవరం వైపు నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి నడిచివెళ్తున్న భవానీలకు, భక్తులకు టోలిగేటు నిర్వాహకులు పాత్ ఫౌండేషన్ సభ్యులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవానీలు సేద తీరడానికి టెంట్లు వేయించారు. అనారోగ్యాలకు గురి అయిన వారి కోసం వైద్యశిబిరం ఏర్పాటుచేసి వైద్యపరీక్షలతో పాటు జండుబామ్, అమృతంజన్ వంటి నొప్పి ఉపశమన బామ్‌లను పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో అన్నదానం, రాత్రి అల్పాహారం, టీ, పాలు పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు 150 నుంచి 200 మంది భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు పాత్ ఫౌండేషన్ ఐటీ మేనేజర్ సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దూబచర్లలో శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో గంటావారిగూడెంకి చెందిన తానం ప్రేమ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఇటుకల బట్టీ సమీ పంలో ఉన్న సర్వీస్ రోడ్డులో భవానీలు నడిచి వెళుతుండగా ప్రేమ్ కుమార్ బైక్‌పై దూబచర్ల వెళుతున్న తరుణంలో చీకటిలో భవానీలు కనిపించక పోవడంతో కాకినాడ జిల్లా కొత్త ఇసుకపల్లికి చెందిన లోవరాజును ఢీకొట్టాడు. దీంతో లోవరాజు కాలు విరిగిపోగా ప్రేమ్ కుమార్ రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

నల్లజర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐ. పంగిడికి చెందిన రమేష్ దంపతులు తన ముగ్గురు చిన్నారులతో కలిసి నడుచుకుంటూ విజయవాడ ఇంద్రకీలాద్రికి బయలుదేరారు.ఈక్రమంలో చిన్నారులు తప్పిపోవడంతో నల్లజర్ల పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ద్వారా పరిశీలించి గంటల వ్యవధిలో పిల్లల ఆచూకీ తెలుసుకున్నారు.